క్లుప్తంగా

శబరిమల బయల్దేరిన స్వాములు



దాచేపల్లి: అయ్యప్పమాలధారులు శనివారం శబరిమల బయలుదేరారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మందపాటి రమేష్‌రెడ్డితో పాటుగా మరో40మంది మాలధారులు స్థానిక శివాలయం, కనకదుర్గమ్మతల్లి, వీర్ల అంకమ్మతల్లి దేవాలయాల్లో ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం గురుస్వాములు మాలధారులకు ఇరుముడి కట్టారు. అయ్యప్పమాలధారులకు భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు పల్లపు హనుమంతరావు, వేల్పుల కిషోర్ పాల్గొన్నారు.

సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని పిచికారీ చేయాలి



దాచేపల్లి: తుఫాన్ నేపథ్యంలో మిరప పంటను కాపాడుకునేందుకు సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని పిచికారీ చేయాలని ఏఓ దొండేటి పాపకుమారి అన్నారు. మండల పరిధిలో రైతులు సాగు చేస్తున్న పత్తి, మిరప, వరి పంటలను ఉద్యానవన శాఖ అధికారులతో కలిసి ఏఓ పాపకుమారి శనివారం పరిశీలించారు. నీళ్లలో నుంచి మిరప మొక్కలు తేరుకున్న తరువాత 5 గ్రాముల స్థూల పోషకాల మిశ్రమాన్ని లీటర్ నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు మూడు సార్లు పిచికారీ చేయాలని ఏఓ పాపకుమారి చెప్పారు. వరి పంటలో నీళ్లు నిలబడితే కాలువలు తీసి బయటకు పంపించాలని, లీటర్ నీటిలో 50గ్రాముల ఉప్పును కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఈ పరిశీలనలో ఉద్యానవన శాఖ అధికారి మోహన్ ఉన్నారు.

క్విజ్ విజేతలకు బహుమతులు ప్రదానం



మాచర్ల: పట్టణంలోని సమర్పణ మందిరంలో జరిగిన బైబిల్ క్విజ్ విజేతలకు బహుమతులు శనివారం అందించారు. క్రిస్మస్ వేడుకలలో భాగంగా పల్నాడు దైవసేవకుల సహవాసం ఆధ్వర్యంలో నిర్వహించిన బైబిల్ క్విజ్ పోటీలు ఘనంగా ముగిశాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలువురు ఈ పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమం ఆద్యంతం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి పాస్టర్ షడ్రక్ అధ్యక్షత వహించగా, క్విజ్‌లో న్యాయ నిర్ణయతలుగా మోహన్ బాబు, యెహోషువ, ఎలీషా, ప్రసాద్‌లు వ్యవహరించారు. కన్వీనర్లు వెంకయ్య, శంకర్, బ్రహ్మానాయుడు ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందించారు. యువత ఆధ్యాత్మిక జీవితాన్ని అలవర్చుకొని సమాజానికి ఉపయోగకరంగా ఉండాలని అధ్యక్షుడు జాన్ వెస్లీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సుందర రావు, నరసింహారావు, ప్రవీణ్, అనిల్, మురళి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజ



సత్తెనపల్లి: పట్టణంలోని పాతబస్టాండ్ లోగల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎదుట అయ్యప్ప స్వామి ప్రథమ మండల పడిపూజ మహోత్సవం శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆ ప్రాంగణం అంతా విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఐదు అరటి మండపాలు, 18 కలశాలు, తొమ్మిది అభిషేకాలతో గురుస్వామి గంటా శ్రీనివాసరావు, తాంత్రిక పూజావర్యులు బ్రహ్మశ్రీ యలవర్తి గౌరీ శంకర్ గురుస్వామి నేతృత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆర్కెస్ట్రా నరసరావుపేటకు చెందిన దప్పు శ్రీను బృందం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దేవతల అలంకరణతో స్వాములు నృత్యం చేశారు. పడిపూజ మహోత్సవానికి మాల ధరించిన అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆ ప్రాంతమంతా అయ్యప్ప స్వామి నామస్మరణతో మారుమోగింది. భజన అనంతరం మాలధరించిన స్వాములకు భిక్షను అందించారు. స్వాములకు, భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రామాలయంలో పూజలు

నాదెండ్ల: గణపవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన పూజారులు ఉమామహేశ్వరశర్మ, అనిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం బహుళ త్రయోదశి సందర్భంగా గోపూజ, ఆలయ ప్రదక్షిణ, ఉదయం 9 గంటలకు సామూహిక శ్రీరమాసహిత వీరవెంకట సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 11న సోమవారం మాస శివరాత్రిని పురస్కరించుకుని భవానీ శంకర స్వామి వారికి ఏకాదశి రుద్రాభిషేకం, అన్నాభిషేకం జరుగుతుందన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

- జిల్లా జడ్జి జి.వెంకటేశ్వర్లు
- జాతీయ లోక్ అదాలత్‌లో 99 కేసులకు పరిష్కారం



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు

గురజాల: రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా జడ్జి జి.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక కోర్టు భవనాల్లో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 99 కేసులు పరిష్కరించగా వాటిలో సివిల్ -36, క్రిమినల్ -49, మెయింటెనెన్స్-10, ప్రీ లిటిగేషన్ -4 కేసులు పరిష్కరించగా ఈ కేసులకు సంబంధిచి రూ.3,25,9,255లు కక్షిదారులకు చెల్లించడం జరిగిందన్నారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. లోక్ అదాలత్ ద్వారా సమయంతో పాటు ధనం కూడా ఆదా చేసుకోవచ్చన్నారు. సీనియర్ సివిల్ జడ్జి బి.ఎల్.వి.శేషాద్రి, జూనియర్ సివిల్ జడ్జి డి.షర్మిళ, న్యాయవాదులు చల్లా రామిరెడ్డి, ఆచంట శ్రీనివాసరావు, జక్కా చెన్నకేశవరావు, కర్రా చిన కోటేశ్వరరావు, చీతిరాల కోటేశ్వరరావు తదితరులున్నారు.

62 కేసులు పరిష్కారం..

పిడుగురాళ్ల: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయమూర్తి ఎం.మురళీగంగాధర్‌రావు ఉచిత న్యాయ సేవల చట్టాల గురించి, లోక్ అదాలత్ ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం జరిగిన లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు 3, క్రిమినల్ కేసుల్లో మనోవర్తి కేసులు 3, గృహహింస కేసులు 2, ప్రీ లిటిగేషన్ కేసులు నిమిత్తం 62 కేసులు పరిష్కరించారు. పరిష్కారం కింద మొత్తం రూ. 47,41,558లు కక్షిదారులకు ఇప్పించడం జరిగిందన్నారు. లోక్ అదాలత్ మెంబర్లు పి.మాణిక్యం, బి.అచ్చారావు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు,పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

82 కేసులకు పరిష్కారం..



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సివిల్ జడ్జి శారద

మాచర్ల: దేశవ్యాప్తంగా కక్షిదారుల కోసం జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యాక్రమాలను కోర్టులు పరిష్కరిస్తున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని మాచర్ల అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శారద అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ కార్యాక్రమంలో భాగంగా 82 కేసులను పరిష్కరించారు. అంతకు ముందు మండల లీగల్ సెల్ అధ్యక్షత వహించి కక్షిదారులతో మాట్లాడుతూ ప్రజలు, కక్షిదారులు ఇబ్బంది పడకుండా ఎప్పటికప్పుడు జాతీయ మహాలోక్ అదాలత్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా కోర్టు పరిధిలోని 60 క్రిమినల్ కేసులు, 14 సివిల్ కేసులు ముందస్తు రాజీకి సంబంధించి మరో 8 కేసులు పరిష్కరించారు. మొత్తం 82 కేసులు పరిష్కరించి లబ్ధిదారులకు ప్రయోజనం కల్పించారు. సీనియర్ న్యాయవాదులు జీవీ, సీహెచ్ నాగిరెడ్డి, గట్ల సత్యనారాయణరెడ్డి, కె.డేవిడ్‌రాజ్, శీలం వెంకటేశ్వర్లుతో పాటు పలువురు సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది బ్రహ్మారెడ్డి, సుబ్బారావు, కోర్టు పోలీస్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

ముస్లిం, మైనార్టీలు వైఎస్సార్ సీపీకి రుణపడి ఉంటాం

వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ షేక్ సుభాని



దాచేపల్లి: ముస్లిం, మైనార్టీలు వైఎస్సార్ సీపీకి రుణపడి ఉంటారని ఆ పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభాని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు సహకారంతో రూ.కోటి వ్యయంతో దాచేపల్లిలో షాదీఖానా నిర్మించామని, దశబ్దాల కలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాకారం చేసిందని ఆయన చెప్పారు. గత ప్రభుత్వాలు షాదీఖానా నిర్మిస్తామని నిర్మించకుండా ముస్లింలను మోసం చేస్తే ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని షాదీఖానా నిర్మించి మాట నిలబెట్టుకున్నారని ఆయన పేర్కొన్నారు. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లను వైఎస్సార్ ఇచ్చారని, ఆయన తనయుడు సీఎం జగన్ మైనార్టీలకు అన్ని విధాలుగా అండగా ఉన్నారని అన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రుణ తీర్చుకునేలా ముస్లింలంతా అండగా ఉంటామని, కాసు మహేష్‌రెడ్డిని ఎమ్మెల్యేగా, శ్రీకృష్ణదేవరాయలుని ఎంపీగా మళ్లీ గెలుపించుకుంటాని సుభాని వెల్లడించారు.

అయోధ్య రామమందిరం అక్షింతలకు ఘనస్వాగతం



అయోధ్య రామమందిర కలశం, అంక్షితల పూర్ణ కుంభాన్ని స్వాగతిస్తున్న మహిళలు

క్రోసూరు: వచ్చే జనవరి 22వ తేదీన అయోధ్యలో రామమందిరం ప్రారంభం సందర్భంగా దేశంలోని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు చేరాలన్న సంకల్పంతో తీసుకొచ్చిన రామ మందిర అక్షింతలకు శనివారం క్రోసూరు గ్రామ ప్రజలు ఘనస్వాగతం పలికారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమం క్రోసూరులో అత్యంత వైభవోపేతంగా శోభాయాత్రగా జరిగింది. ఈ శోభాయాత్ర లక్ష్మీనరసింహస్వామి దేవాలయం నుంచి ప్రారంభమై పురవీధులలో పయనిస్తూ క్రోసురులోని అన్ని దేవాలయాలను స్పృశిస్తూ వేణుగోపాల స్వామి దేవాలయానికి చేరుకుంది. దేవాలయ పూజారి పూర్ణకుంభంతో అయోధ్య అక్షింతలకు స్వాగతం పలికారు. మహిళలు, భక్తులు తండోపతండాలుగా హాజరై అయోధ్య రామమందిర అక్షింతలు ఉన్న పూర్ణకుంభానికి భక్తిశ్రద్ధలతో హారతులు ఇచ్చారు. జైశ్రీరామ్ అంటూ జయ జయ ధ్వనులు చేస్తూ క్రోసూరు పురవీధులు మారుమోగాయి. జనవరి 1వతేదీ నుంచి 15 వరకు భక్తులకు పంపిణీ చేస్తామని విశ్వహిందూ పరిషత్ మండల ప్రచారక్ కామేశ్వరాచారి తెలియజేశారు.

ఎస్టీయూ సత్తెనపల్లి మండల అధ్యక్షుడిగా రెహమాన్



ఎస్‌ఎమ్.రెహమాన్ , మోదుగుల అప్పారావు

సత్తెనపల్లి: రాష్ట్రోపాధ్యాయ సంఘం సత్తెనపల్లి మండల శాఖ అధ్యక్షుడిగా ఎస్ఎం రెహమాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సత్తెనపల్లి ప్రాంతీయ పరిధిలో గల సత్తెనపల్లి, ముప్పాళ్ల, రాజుపాలెం, బెల్లంకొండ మండల శాఖల నూతన కార్యవర్గ ఎన్నికల సమావేశం సత్తెనపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం జరిగింది. సత్తెనపల్లి ప్రాంతీయ కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని (సుబ్బు) అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి మండల శాఖ అధ్యక్షుడిగా ఎస్ఎం .రెహమాన్, గౌరవ అధ్యక్షుడిగా జి.సాల్మన్ రాజు, మండల శాఖ ప్రధాన కార్యదర్శిగా మోదుగుల అప్పారావు, ఆర్థిక కార్యదర్శిగా పి.వెంకయ్యలను ఎన్నుకున్నారు. ముప్పాళ్ళ మండల మండల శాఖ అధ్యక్షుడిగా పిరామారావు, గౌరవ అధ్యక్షుడిగా టి.అచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్కే నూరుల్లా, ఆర్థిక కార్యదర్శిగా పి.వెంకట్రావులు ఎన్నికయ్యారు. రాజుపాలెం మండల శాఖ అధ్యక్షుడిగా వై.శ్రీనివాస రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా ఎస్కే మీరాస, ప్రధాన కార్యదర్శిగా కె.పురుషోత్తం, ఆర్థిక కార్యదర్శిగా ఎన్.బాబులు ఎన్నికయ్యారు. బెల్లంకొండ మండల శాఖ అధ్యక్షుడిగా ఎం .రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి.స్వాతి బాయి, ఆర్థిక కార్యదర్శిగా ఎస్కే బషీద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జోసఫ్ సుధీర్‌బాబు

సత్తెనపల్లి: ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వాలు దెబ్బతీయరాదని, అలా చేసే ప్రభుత్వాలు మనుగడ సాధించలేవని ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్ బాబు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం జరిగిన ఏపీ ఎస్టీయూ సత్తెనపల్లి ఏరియా పరిధిలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, బెల్లంకొండ శాఖల నూతన వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి సత్తెనపల్లి ప్రాంతీయ కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని అధ్యక్షతన వహించారు. జోసెఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడేలా సమీక్షించి, వారి సంక్షేమానికి కట్టుబడే చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎం సుభాని మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఓపీఎస్‌ను పునరుద్ధించాలని కోరారు.

పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎల్వీ రామిరెడ్డి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్ యాదవ్‌లు మాట్లాడారు. సమావేశంలో సత్తెనపల్లి ప్రాంతీయ పరిధిలో గల సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, బెల్లంకొండ మండలాల నూతన కార్యవర్గలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్కే కరిముల్లా, ఆర్థిక కార్యదర్శి ఇ.ఏమండీ, సీనియర్ నాయకులు జె.శ్రీనివాసరావు, ఏరియా కార్యదర్శులు కె రామలింగయ్య, భీష్మారావు, ఎస్.రాఘవ, సీనియర్ నాయకులు సిహెచ్ భానుమూర్తి, కేజీబీవీ రాష్ట్ర నాయకులు శేషలత, అర్చన, మంజువాణి, ఏఐటీయుసీ జిల్లా ఉపాధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు, సత్తెనపల్లి ఏరియా పరిధిలోగల నాలుగు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ఎం.రెహమాన్, కె.సురేష్, పి.రామారావు, కె.పురుషోత్తం ఎస్ కె.నుహానుల్లా, బి.స్వాతిబాయ్, పి.నాగవేణు, టి.అచ్చయ్య, ఎమ్.అప్పారావు, టి.రాజు, జి.సాల్మన్ రాజు, భాగ్యలక్ష్మి, ఎస్ కె సుభాని, రవి తదితరులు పాల్గొ న్నారు.

మహిళను కులం పేరుతో దూషించి, వేధించిన వ్యక్తిపై కేసు

క్రోసూరు: మహిళను వేధిస్తూ, కులం పేరుతో దూషించాడన్న ఫిర్యాదుపై శనివారం క్రోసూరు ఇన్‌చార్జి ఎస్ఐ ఎం.సత్యనారాయణ ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వివరాల్లోకి పోతే అమరావతి మండలం, తురగావారిపాలెంకు చెందిన ఓ మహిళను గత కొంత కాలంగా అదే గ్రామానికి చెందిన ఉప్పుటూరి నాగార్జునరెడ్డి వెంట పడుతూ పొలాల్లో, ఇళ్ల దగ్గర ఆమెను ఇబ్బంది పెడుతూ, ఆమెగురించి చెడుగా ప్రచారం చేస్తున్నాడు. అంతేకాక ఈ ఏడాది అక్టోబర్‌లో ఆమె పత్తి తీసే కూలీ పనులకు వెళ్లి తిరిగి క్రోసూరు మండలం బయ్యవరం నుంచి తురగావారిపాలెం నడుచుకొని వెళ్తుండగా రాత్రి సుమారు 7 గంటల సమయంలో ఆమె చేయి పట్టుకొని కులం పేరుతో తిట్టి, చేతులతో కొట్టి బెదిరించాడని అని ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్ఐ కేసు నమోదు చేయగా, సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మాదల(ముప్పాళ్ళ): రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్న ప్రమాదంలో ఇరువురికి గాయాలైన సంఘటన మండలంలోని మాదల వద్ద శనివారం జరిగింది. సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పిడుగురాళ్ల మండలం జూలకల్లు గ్రామానికి చెందిన వినుకొండ రాజేష్ తన ద్విచక్రవాహనంపై సత్తెనపల్లి వైపు వెళుతుండగా, మాదల గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన కొమరగిరి రవి అనే అతను ఎదురుగా వచ్చి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలవటంతో చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీకి విఫలయత్నం



పెదకూరపాడు: మండల పరిధిలోని 75 త్యాళ్లూరు, పెదకూరపాడు మద్యం దుకాణాల్లో గురువారం రాత్రి గుర్తుతెలియని అగంతకులు చోరీకి విఫలయత్నం చేశారు. 75 త్యాళ్లూరు ప్రభుత్వ మద్యం దుకాణంపై రేకులను కట్ చేసి లోపలికి ప్రవేశించి, నగదు కోసం వెతికారు. దుకాణంలో నగదు లేకపోవడంతో మూడు మద్యం బాటిళ్లు తీసుకుని పరారయ్యారు. పెదకూరపాడు మద్యం దుకాణం షట్టర్ తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించారు. తాళాలు పగలగొట్టే సమయంలో అక్కడ ఉన్న వాచ్‌మెన్ అప్రమత్తమై కేకలు వేయడంతో దుండగులు పరారయ్యారు. చోరీ యత్నం ఘటన సీసీ పుటేజీల్లో రికార్డు అయింది. పెదకూరపాడు మద్యం దుకాణం సూపర్ వైజర్ వెంకటేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

పెన్షనర్స్ పోరాటం న్యాయమైనది

సత్తెనపల్లి మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి

సత్తెనపల్లి: పెన్షనర్స్ చేస్తున్న పోరాటం న్యాయమైనదని సత్తెనపల్లి మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో గల పయనీర్ ఆటో మొబైల్ షాపును ఖాళీ చేయాలని కోరుతూ పెన్షనర్స్ చేస్తున్న నిరసన కార్యక్రమం శనివారం 26వ రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో షాపులను ఖాళీ చేయించాలని 40, 50 మంది పెన్షనర్స్ భవనం ఎదుట సమావేశమయ్యారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన తన మద్దతు తెలియజేశారు. అనంతరం పెన్షనర్స్ గదులను ఖాళీ చేశారు. సీపీఎం నాయకులు గద్దె చలమయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దావులూరి కోటేశ్వర రావు, ప్రజా సంఘాల నాయకులు జూపల్లి పాల్, జిల్లెల్ల పాల్‌రాజ్, జెట్టి శేఖర్‌లు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యుడు బి.రామారావు, సంఘ నాయకులు ఆర్.పురుషోత్తం, పి.చంద్రయ్య, కె.హనుమంతరావు, డి.మల్లేశ్వర రావు, జె.లక్ష్మీనారాయణ, జి.మురహరిరావు, డి.శృంగారం, కె.పోతులూరయ్య, కేబీఆర్‌జే ప్రసాద్, కె.రంగారెడ్డి, వై.వెంకటేశ్వర్లు, ఎల్.సుబ్బారావు, జగన్నాథ నాయుడు, వెంకటాద్రి, వెంకట్రావు ఉన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

కొత్తూరులో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం



కొత్తూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న బూడిద శ్రీనివాసరావు

విజయపురిసౌత్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందిస్తుందని వైఎస్సార్ సీపీ మండల నాయకుడు బూడిద శ్రీనివాసరావు అన్నారు. శనివారం మాచర్ల మండలం కొత్తూరు గ్రామంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ముందుగా గ్రామ సచివాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి ప్రతి గడపలో ప్రభుత్వ సేవలను వివరించారు. మాచర్ల జడ్పీటీసీ మల్లుస్వామి, ఉమ్మడి గుంటూరు జిల్లా గొర్రెల పెంపకందారుల యూనియన్ చైర్మన్ బూడిద సైదులు, కొత్తపల్లి సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు బ్రహ్మంనాయక్, కంభంపాడు మాజీ సర్పంచ్ ఆరికట్ల చంద్రశేఖర్‌రెడ్డి, ఉప ఎంపీపీ సుజాత కోటిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శేరెడ్డి వీరారెడ్డి, కొత్తూరు సర్పంచ్ మద్దిగపు అచ్చిరెడ్డి, తాళ్లపల్లి సర్పంచ్ యంగ్ర గాలయ్య, ఎంపీటీసీ వడితే మంగాబాయి, ఏకోనాంపేట సర్పంచ్ రమావత్ శుక్యానాయక్, మాజీ ఎంపీపీ కొర్రా సాంబనాయక్, బొయా శ్రీనివాసరెడ్డి, మేకపోతుల మట్టారెడ్డి, గ్రామ నాయకులు మద్దిగపు వెంకట్రామిరెడ్డి, వెంకటశివారెడ్డి, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ స్నేహ మాధుర్యం



స్నేహసుమాలు గ్రంథ రచయిత ఆంజనేయరెడ్డిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

- సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో 1972-73 పది బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు

రెంటచింతల, పెదకూరపాడు: పూర్వ విద్యార్థులు 50 ఏళ్లకు మళ్లీ అంతా కలిశారు. ఒకరిని ఒకరు పరిచయం చేసుకుంటూ ఆనాటి తీపిగుర్తులను నెమరు వేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో 1972-73 సంవత్సరం చదివిన పది విద్యార్థుల సమావేశం నిర్వహించారు. స్వర్ణోత్సవంలో భాగంగా పెదకూరపాడులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆవరణలో శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బ్యాచ్ విద్యార్థి సుమశ్రీ కొండసాని ఆంజనేయరెడ్డి 108 పద్యాలతో రచించిన స్నేహసుమాలు గ్రంథాన్ని సహ విద్యార్థి రెవ.ఫాదర్ పుట్టి సుందరరాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ గ్రంథాన్ని తన మిత్రుడు ఫాదర్ సుందరరాజుకు అంకితమిచ్చారు. ఈ సందర్భంగా గ్రంథ రచయిత ఆంజనేయ రెడ్డిని ఘనంగా సన్మానించారు. తనతో కలిసి చదువుకున్న పూర్వమిత్రులను 50 సంవత్సరాల అనంతరం కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని మధ్యప్రదేశ్ విశ్రాంత డీజీపీ బండి మరియకుమార్ పేర్కొన్నారు. ఆనాటి ఉపాధ్యాయులు నేర్పిన నైతిక విలువలతో కూడిన విద్యకారణంగానే తాము ఉన్నతస్థాయికి చేరుకున్నామని డా. చంద్రశేఖర్, డా. జ్వార్వేస్‌రెడ్డి, కేవీ ప్రభాకరరావులు గుర్తు చేసుకున్నారు. ఎన్నో ఏళ్ల తరువాత స్నేహితులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని విశ్రాంత ఉపాధ్యాయుడు తుమ్మా లూర్దురెడ్డి తన సంతోషం వ్యక్తం చేశారు. ఆత్మీయ సమ్మేళనంలో సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ హెచ్ఎం సిస్టర్ జ్యోతి, సోమసాని పేర్రెడ్డి, లింగమూర్తి తదితరులున్నారు.

చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలి



పౌష్టికాహారం అందజేస్తున్న పట్టణ సీఐ ఆంజనేయులు

పిడుగురాళ్ల: చిన్నారులు పౌష్టికారాహాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పట్టణ సీఐ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల వద్ద పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లావుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు పౌష్టికాహారం అందించటం జరుగుతుందని తెలిపారు. డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ చిన్నారులతో వ్యాధి నిరోధక శక్తి పెరగాలంటే క్రమంతప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, అలా తీసుకునే విధంగా ఎన్‌జీఓ సంస్థలు ముందుకు వచ్చి ప్రోత్సహించాలని తెలియజేశారు. పుట్టిన బిడ్డ నుంచి 15 ఏళ్ల లోపు వయస్సు ఉన్న దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి, వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని వారికి పౌష్టికాహారం అందిస్తున్నట్లు వెల్లడించారు. వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెట్ల పొదల్లో అదృశ్యమైన యువకుడి మృతదేహం

దాచేపల్లి: ఇంటి నుంచి వెళ్లిన యువకుడు శవమై కనిపించాడు. దాచేపల్లికి చెందిన కొప్పుల నరసింహరావు, లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు గోపి(24) గోగులపాడు రోడ్డులోని చెట్ల పొదల్లో శవమై ఉన్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. గోపి తండ్రి మృతిచెందగా తల్లి లక్ష్మితో కలిసి గోపి, అతని తమ్ముడు నివాసం ఉంటున్నారు. ఇంట్లో తల్లితో గోపి గొడవపడి ఈ నెల 2వ తేదీన ఇంటి నుంచి వెళ్లాడు. బంధువుల వద్ద, చుట్టు పక్కల గ్రామాల్లో గోపీ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఫలితంలేదు. గోగులపాడు రోడ్డులోని ముళ్ల పొదల్లో దుర్వాసన వెదజల్లటంతో రైతులు, గేదెలు మేపుకొనే కాపరులు వెళ్లి చూడగా పూర్తిగా పాడైన అస్థి పంజరంను గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సంఘటన స్థలం చేరుకుని పరిశీలించారు. గోపి కుటుంబ సభ్యులను సంఘటన స్థలానికి వెళ్లి అస్థి పంజరంని చూపించగా జీన్‌ఫ్యాంట్, సెల్‌ఫోన్ ఆధారంగా గోపిగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.సంధ్యారాణి చెప్పారు.

వృద్ధులకు అన్నసంతర్పణ

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు, 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని మాతృశ్రీ మొల్లమాంబ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, నరసరావుపేట రోడ్ లోని పరివర్తన చెవిటి, మూగ, మానసిక వికలాంగుల ఆశ్రమం పాఠశాలలోని చిన్నారులకు శనివారం అన్న సంతర్పణ నిర్వహించారు. ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ, 31 వార్డులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేపట్టారు. అలాగే నాగన్నకుంటలో అన్న సంతర్పణ నిర్వహించారు. ముందుగా పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో కేక్ కట్ చేసి నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర జల వనరుల శాఖమంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగుర్‌మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయభాస్కరరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.